

ఈవీఎం గోదాములు పరిశీలన

సిరిసిల్ల: సర్ధాపూర్‌లోని ఈవీఎం గోదామును కలెక్టర్ అనురాగ్ జయంతి బుధవారం పరిశీలించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆర్డీవో ఆనంద్‌కుమార్ ఉన్నారు.



విద్యుత్ పనులు ప్రారంభం

గంభీరావుపేట(సిరిసిల్ల): నర్మాలలోని అగస్త్య ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమలో రూ.36.43 లక్షలతో విద్యుత్ సరఫరా పనులను బుధవారం ప్రారంభించారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

21న గద్దర్ సంస్మరణ సభ



సిరిసిల్లఅర్బన్: ప్రజాయుద్ధ నౌక గద్దర్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నేతలు కోరారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో గద్దర్ సంస్మరణ సభ కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ప్రజాసంఘాల నేతలు బోల్లి రామ్మోహన్, రాగుల రాములు మాట్లాడుతూ వాసవి కల్యాణ మండపంలో ఈనెల 21న సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిరిగిరి రమేశ్, కంసాల మల్లేశం, చెన్నమనేని పురుషోత్తం, కానాపురం లక్ష్మణ్, బొజ్జ కనకయ్య ఉన్నారు.

శాస్త్రీయ పద్ధతుల్లో చేపపిల్లల పెంపకం



ముస్తాబాద్(సిరిసిల్ల): జిల్లాలో శాస్త్రీయ పద్ధతుల్లో చేపపిల్లల పెంపకాన్ని చేపట్టి, మత్స్యకారులకు ఉపాధి అవకాశాల కల్పనకు ప్రణాళిక రూపొందించినట్లు జిల్లా ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ చొప్పరి రామచంద్రం పేర్కొన్నారు. వెంకట్రావుపల్లిలో పెద్దమ్మ ఆలయంలో బుధవారం పూజలు చేశారు. చైర్మన్ రామచంద్రం మాట్లాడుతూ చెరువులు, కుంటల్లో నాణ్యమైన ఉచిత చేపపిల్లల సీడ్ వేస్తామన్నారు. ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, డైరెక్టర్లు గాడిచర్ల దేవయ్య, గాడిచర్ల శ్రీనివాస్, బీసీ స్టడీసర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి, వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు రాంగోపాల్ నాయకులు గజ్జెల రాజు, శ్రీనివాస్, రాములు, నర్సయ్య, రామచంద్రం, రాజు, శేఖర్ పాల్గొన్నారు.

అండగా నిలవడం అభినందనీయం



సిరిసిల్లఅర్బన్: బ్యాచ్‌మేట్ కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమని ఎస్పీ అఖిల్ మహాజన్ కొనియాడారు. 1995వ బ్యాచ్‌కు చెందిన ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ పదిలం సుధాకర్ జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా అదే బ్యాచ్‌కు చెందిన ఏఆర్ సిబ్బంది బాధిత కుటుంబానికి రూ.1.80 లక్షలను ఎస్పీ అఖిల్ మహాజన్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఆర్ఐలు యాదగిరి, మధుకర్, రమేశ్, కానిస్టేబుల్ రవీందర్, స్వామిరావు, మల్లేశం, రవీందర్, ప్రభాకర్ ఉన్నారు.

ఓటు వినియోగంపై విస్తృత ప్రచారం

సిరిసిల్లకల్చరల్: ఓటు వినియోగంపై విస్తృత ప్రచారంతో అవగాహన కల్పించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. రాష్ట్ర జాయింట్ ఎన్నికల ప్రధాన అధికారి సర్ఫరాజ్ అహ్మద్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 19న 5కే రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండో విడత ఓటర్ జాబితాను ఈనెల 21న విడుదల చేస్తామని తెలిపారు. ఆర్డీవో ఆనంద్‌కుమార్, స్వీప్ నోడల్ అధికారి, ఏపీడీ నర్సింహులు, ఈడీఎం శ్రీనివాస్, డీపీఆర్‌వో దశరథం పాల్గొన్నారు.

యువకుడిని కాపాడిన ఫైర్ సిబ్బంది



సిరిసిల్లఅర్బన్: కుటుంబ కలహాల నేపథ్యంలో చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఒకరిని అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. స్థానికులు, ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాలు. సిరిసిల్లకు చెందిన గంజి సతీశ్ కుటుంబ కలహాలతో బుధవారం రాత్రి స్థానిక కొత్త చెరువులో దూకాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని చెరువులోకి దిగి తాళ్ల సహాయంతో సతీశ్‌ను బయటకు తీసుకొచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రాణాలకు తెగించి యువకుడిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది తీరుపై స్థానికులు అభినందించారు. అగ్నిమాపక సిబ్బంది ఎల్ఎఫ్ నరసింహాచారి, టి.వెంకటేశ్, ఎ.నాగరాజు తదితరులు ఉన్నారు.

> గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్‌కు చెందిన రాజిరెడ్డి తనకున్న మూడెకరాల భూమికి హద్దులు చూపాలని కోరుతూ మండల సర్వేయర్‌కు ఎనిమిది నెలల కిందట మీసేవ కేంద్రం ద్వారా దరఖాస్తు చేశాడు. నిబంధనల మేరకు ఒక్కో సర్వే నంబర్‌కు రూ.300 చొప్పున రెవెన్యూశాఖకు ఫీజు చెల్లించాడు. గత జనవరిలో దరఖాస్తు చేస్తే ఎండాకాలం పూర్తయింది. వానాకాలం వచ్చినా ఎనిమిది నెలలుగా రాజిరెడ్డి భూసర్వే చేపట్టలేదు. భూమి హద్దులు తేలలేదు.

> ‘చందుర్తి మండలం రామారావుపల్లికి చెందిన మల్లేశం తన ఎనిమిది ఎకరాల భూమికి హద్దులు చూపించాలని డివిజన్ సర్వేయర్(డీ.ఐ)కు మీసేవ కేంద్రం ద్వారా ఫీజులు చెల్లించాడు. ఎండాకాలంలో భూమిని కొలిస్తే పంటలు ఉండవని, ఏడాది కిందటే డబ్బులు చెల్లించాడు. కానీ వేములవాడ డీ.ఐ. ప్రభుత్వ భూముల సర్వే పనుల్లో బిజీగా ఉంటూ.. మల్లేశం భూమిని కొలిచేందుకు సమయం ఇవ్వడం లేదు.

హద్దులు తెలిసేదెలా ?!

- జిల్లాలో సర్వేయర్ల కొరత
- ఐదు మండలాల్లోని పోస్టులు ఖాళీ
- డివిజన్ స్థాయిలోనూ సర్వే ఇన్‌స్పెక్టర్ కరువు
- ఉన్న వారు ప్రభుత్వ పనుల్లో బిజీ
- పల్లెల్లో పరిష్కారం కాని భూవివాదాలు
- పెండింగ్‌లో 822 సర్వే దరఖాస్తులు

రైతుల వివరాలు

మండలం	సర్వే నంబర్లు	రైతులు
సిరిసిల్ల	2,565	3,287
తంగళ్లపల్లి	9,107	10,387
గంభీరావుపేట	9,423	9,691
ముస్తాబాద్	9,633	11,192
ఎల్లారెడ్డిపేట	11,753	9,782
వీర్నపల్లి	1,148	3,018
వేములవాడఅర్బన్	4,950	5,039
వేములవాడరూరల్	6,081	6,415
బోయినపల్లి	8,692	9,013
కోనరావుపేట	8,539	9,867
చందుర్తి	6,367	8,110
రుద్రంగి	1,247	2,751
మొత్తం	91,416	1,03,140



హద్దులు లేని భూమి



క్షేత్రస్థాయిలో భూసర్వేలు

సిరిసిల్ల: జిల్లాలో భూముల సర్వే ఓ సవాల్‌గా మారింది. భూమి హద్దులు తెలియక క్షేత్రస్థాయిలో రైతులు గొడవలకు దిగుతున్నారు. తమ భూమిలోకి వచ్చారంటే.. తమ భూమిలోకి వచ్చారని దాడులు చేసుకుంటున్నారు. జిల్లాలో భూముల ధరలు పెరగడం వివాదాలకు దారితీస్తుంది. ఎక్కడికెళ్లినా ఎకరం భూమి తక్కువగా రూ.20 లక్షలు పలుకుతుంది. గుంట భూమి కనీసం రూ.50వేలు పలుకుతుంది. ఇలా ధరలు అమాంతం పెరగడంతో భూవివాదాలు రాజుకుంటున్నాయి. భూహద్దులు పరిష్కరించే సర్వేయర్ల కొరత జిల్లాలో తీవ్రంగా ఉంది. జిల్లాలోని 13 మండలాలకు 8 మంది మాత్రమే సర్వేయర్లు ఉన్నారు. వారు సైతం ప్రభుత్వ భూసర్వే పనుల్లో బిజీగా ఉండడంతో రైతులు చేసుకున్న దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా భూమి సర్వే చేయాలని చేసుకున్న 822 దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

వేధిస్తున్న సర్వేయర్ల కొరత

జిల్లాలో 255 గ్రామాలు, 171 రెవెన్యూ గ్రామాల్లో 91,416 సర్వేనంబర్లు ఉండగా 4,68,532 ఎకరాల భూమి ఉంది. ఈ భూములను ఐదు దశాబ్దాల కిందట సర్వే చేయగా.. ఇప్పుడు ఆ హద్దులు చెరిగిపోయి వివాదాస్పదమవుతున్నాయి. ప్రస్తుతం గంభీరావుపేట, వేములవాడరూరల్, ఇల్లంతకుంట, రుద్రంగి, చందుర్తి మండలాల్లో సర్వేయర్లు లేరు. సిరిసిల్ల డివిజన్ సర్వేయర్ రత్నం ఏడాది కిందట ఏసీబీ ట్రాప్ చేయగా.. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. అంతకుముందు మూడేళ్ల కిందట వేములవాడలోనూ సర్వేయర్ సత్యనాయణ ఏసీబీకి పట్టుబడ్డారు. ప్రైవేటు సర్వేయర్లపై రైతులకు నమ్మకం లేక ప్రభుత్వ సర్వేయర్ల కోసం నిరీక్షిస్తున్నారు. భూసర్వే చేయాలని రైతులు చేసుకుంటున్న దరఖాస్తుల ద్వారా ప్రతీ నెల దాదాపు రూ.40 వేల వరకు ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. సర్వేయర్ల కొరతతో క్షేత్రస్థాయిలో భూవివాదాలు పరిష్కారం కావడం లేదు.

డబ్బులు చెల్లించి నిరీక్షణ

భూముల సర్వేలకు సంబంధించి ఒక్కో సర్వేనంబర్‌కు మండల సర్వేయర్‌కు రూ.250, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్(జిల్లా స్థాయిలో) అయితే రూ.300 ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న సర్వేనంబర్ సరిహద్దుల భూముల యజమానులకు నోటీసులు ఇవ్వాల్సి ఉంటుంది. గ్రామాల్లో వీఆర్ఏ (విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లు) లేకపోవడంతో నోటీసులు జారీచేయడం లేదు. మరోవైపు ప్రభుత్వపరంగా రైల్వేలైన్, అదనపు టీఎంసీ భూసేకరణ, పోడుభూముల హద్దుల నిర్ధారణ, సాగునీటి ప్రాజెక్టులకు భూసేకరణ వంటి పనుల్లో సర్వేయర్లు బిజీగా ఉంటున్నారు. దీంతో వందలాది దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. ప్రభుత్వ సర్వేయర్లు అయితే భూమి హద్దుల నక్షా(టీపన్) ప్రకారం కొలతలు నిర్ధారిస్తారని, ప్రైవేట్ సర్వేయర్లను ఆశ్రయించడం లేదు. జిల్లాలో సర్వేయర్‌శాఖ అధికారులు డిజిటల్ గ్లోబల్ పోజిషన్ సిస్టమ్(డీజీపీఎస్) విధానంలో శాటిలైట్‌తో అనుసంధానించి సర్వేలు చేస్తుండడంతో భూసేకరణ పనులు వేగవంతమయ్యాయి. కానీ ఇంకా సర్వే కోసం వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

సర్వే దరఖాస్తుల స్వరూపం

మండల సర్వేయర్ల కోసం	: 611
డివిజన్ సర్వే ఇన్‌స్పెక్టర్	: 128
జిల్లా సర్వే ఇన్‌స్పెక్టర్	: 83
మొత్తం పెండింగ్ దరఖాస్తులు	: 822

ప్రాధాన్యత క్రమంలో సర్వే చేస్తున్నాం



జిల్లాలో పని ఒత్తిడి అధికంగా ఉంది. ప్రాధాన్యత క్రమంలో భూసర్వేలు పూర్తి చేస్తున్నాం. మండలాల్లోనూ సర్వేయర్ల కొరతతో కొంత ఇబ్బందిగా ఉంది. పూర్తి స్థాయిలో క్షేత్రస్థాయి సిబ్బంది అందుబాటులో ఉంటే సులభంగా సర్వే చేయవచ్చు. ప్రభుత్వపరంగా వచ్చే సర్వే ఆర్డర్లను ముందుగా సర్వేచేయాల్సి ఉంటుంది. అయినా పెండింగ్ దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో సర్వేలు చేస్తాం.

– వి.శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, సిరిసిల్ల

సిరిపట్టు చీరను ఆవిష్కరించిన గవర్నర్

- హరిప్రసాద్ నైపుణ్యానికి అభినందన



హరిప్రసాద్‌ను అభినందిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్లకు చెందిన నేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్‌కు మరో గౌరవం లభించింది. ఈనెల 7న రాజ్‌భవన్‌లో నిర్వహించిన చేనేత దినోత్సవానికి హరిప్రసాద్ హాజరయ్యారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆప్యాయంగా పలకరించారు. హరిప్రసాద్ తాను నేసిన సిరిపట్టు చీరను ప్రదర్శించాడు. రెండు నెలల శ్రమించి వెండి పోగులు, పట్టుదారంతో చీర నేసినట్లు వివరించారు. ప్రసాద్ పని తీరును ప్రశంసిస్తూ ఒకే మగ్గం ఉందని తెలుసుకుని, మరో రెండు మగ్గాల ఏర్పాటుకు తాను సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. సిరిసిల్లకు జాతీయస్థాయి ఖ్యాతి తీసుకొస్తున్న హరిప్రసాద్‌ను పలువురు అభినందించారు.

సామాజిక మాధ్యమాలపై అవగాహన ఉండాలి

- జిల్లా షీటీం ఇన్‌చార్జి ప్రమీల



మాట్లాడుతున్న షీటీం ఇన్‌చార్జి ప్రమీల

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థులు సామాజిక మాధ్యమాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా షీటీం ఇన్‌చార్జి, ఏఎస్సై ప్రమీల పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలు, ఫోన్ల వినియోగం, సమాజంలో జరుగుతున్న వివిధ రకాల మోసాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులతో చాటింగ్‌లు ప్రమాదాలకు దారి తీస్తాయన్నారు. వ్యక్తిగత సమాచారం ఇతరులకు పంపవద్దని సూచించారు. మైనర్లు వాహనాలు నడపవద్దని కోరారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పర్శరాములు పాల్గొన్నారు.

కారు పోయిందని ఠాణాకు పోతే..

- ఫిర్యాదుదారునిపై దురుసుగా వ్యవహరించిన పోలీసులు
- చందుర్తి ఠాణాలో కనిపించని ఫ్రెండ్లీ పోలీసింగ్



వేడుకుంటున్న బాధిత యువకుడు

చందుర్తి(వేములవాడ): తన కారును సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారి ఫిర్యాదు చేసేందుకు మంగళవారం చందుర్తి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన మండల కేంద్రానికి చెందిన లింగంపల్లి జలంధర్‌కు చేదు అనుభవం ఎదురైందని వాపోయాడు. బుధవారం విలేకరులతో గోడు వెల్లబెట్టుకున్నాడు. వివరాలు బాధితుడి కథనం ప్రకారం. కారును ఎత్తుకెళ్లారని మంగళవారం ఫిర్యాదు చేసేందుకు వెళ్తే గంటకు పైగా గడచినా దరఖాస్తు తీసుకోకపోవడంతో విసిగిపోయి 100కు డయల్ చేయడంతో ఫిర్యాదు తీసుకున్నట్లు తెలిపాడు. అదే రోజు సాయంత్రం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తన కారు విలువ రూ.2లక్షలు ఉంటుందని మరో పిటిషన్ ఇవ్వాలని ఎస్సై ఒత్తిడి చేశాడని, ఐదు నెలల క్రితం రూ.5.10 లక్షలకు కొన్న కారును రూ.2 లక్షలకు కొన్నట్లు ఫిర్యాదు ఇవ్వలేనని ఇంటి కొచ్చినట్లు తెలిపాడు. తిరిగి అదే రోజు రాత్రి 10 గంటలకు నలుగురు పోలీసులను ఇంటికి పంపించడంతో భయంతో భార్య రాజేశ్వరీని పోలీస్‌స్టేషన్‌కు వెంట తీసుకెళ్లగా.. గంటకు పైగా ఠాణాలో ఉంచుకుని మళ్లీ పిటిషన్ రాసివ్వాలని ఎస్సై పట్టుబట్టాడని వాపోయాడు. పిటిషన్‌లో ఏడాది క్రితం కొనుగోలు చేసిన కారు అదే ధర ఎట్లా రాస్తావు అంటూ బెదిరించాడని, చేసేదేమీ లేక రూ.4.90లక్షలకు కొనుగోలు చేసినట్లు ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిపాడు. ఫిర్యాదు రశీదు ఇవ్వాలని కోరితే బుధవారం ఉదయం ఇస్తానని ఎస్సై బెదిరించారని బాధిత యువకుడు కన్నీటి పర్యంతమయ్యాడు. ఎత్తుకెళ్లిన కారు కోసం ఫిర్యాదు చేసేందుకు పోతే మూడుసార్లు పిటిషన్ తీసుకుని రశీదు ఇవ్వకుండా బెదిరిస్తే న్యాయమెక్కడ జరుగుతుందో తెలపాలని మీడియాను వేడుకున్నాడు. ఈ విషయమై ఎస్సై అశోక్‌ను వివరణ కోరగా బాధితుని ఫిర్యాదు అస్పష్టంగా ఉండడంతో పలుమార్లు పిలిచి వివరణ అడిగామన్నారు. యువకుడి ఆరోపణల్లో నిజం లేదని స్పష్టం చేశారు. పిటిషన్ దారునికి ఎఫ్ఐఆర్ జిరాక్స్ ఇచ్చినట్లు తెలిపారు.

ఇల్లు లేని వారికి ‘గృహలక్ష్మి’ ఇవ్వాలి

- పారదర్శకంగా విచారణ చేపట్టాలి
- 20లోగా విచారణ పూర్తి చేయాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: ఇల్లు లేని వారికి, గుంట జాగ లేని పేదలకు, వితంతువులకు ‘గృహలక్ష్మి’ పథకంలో అవకాశం కల్పించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, విచారణ బృందాలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలో 20,375 మంది గృహలక్ష్మిలో దరఖాస్తు చేసుకున్నారని, 6,300 ఇళ్ల మంజూరుకు అనుమతి ఉందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారిలో నిజమైన అర్హులను, అందులోనూ అత్యంత పేదలను గుర్తించాలని సూచించారు. జీవో 59లో కవర్ అయిన వారిని, దళితబంధు లబ్ధిదారులను, ఎంబీసీ సాయం పొందిన వారిని ఎంపిక చేయొద్దని స్పష్టం చేశారు. 20వ తేదీలోగా నివేదిక సిద్ధం చేయాలన్నారు. అనర్హులకు అవకాశం కల్పిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్హుల జాబితాను గ్రామసభల్లో వెల్లడించి, వారికి సంబంధించిన ఫొటోగ్రఫీ, జియో కో–ఆర్డినేట్స్ తీసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.గంగయ్య, జెడ్పీ సీఈవో బి.గౌతమ్‌రెడ్డి, డీపీవో రవీందర్, అదనపు డీఆర్‌డీవో మదన్‌మోహన్ పాల్గొన్నారు.

గుడి చెరువు పనులు త్వరగా పూర్తి చేయండి

సిరిసిల్లఅర్బన్: వేములవాడ రాజన్న గుడి చెరువు పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. వేములవాడ మున్సిపల్ అభివృద్ధి పనుల ప్రగతి, వీటీడీఏ, పురపాలక, పర్యాటక, ఆర్‌అండ్‌బీ పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ అధికారులతో బుధవారం సమీక్షించారు. గుడి చెరువులో వ్యర్థాలు కలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బద్ది పోచమ్మ శివార్చన పనులు వేగిరం చేయాలన్నారు. లాండ్‌పూలింగ్ పనులను వెంటనే ప్రారంభించాలని, మినీస్టేడియం ఆర్చి, ట్రాక్ పనులు వేగంగా జరగకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, పర్యాటకశాఖ ఇంజినీర్ సరిత, సీపీవో చంద్రిక, పబ్లిక్ హెల్త్ సంపత్‌రావు, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, వీటీడీఏ కార్యదర్శి సమ్మయ్య, పంచాయతీరాజ్ ఈఈ సూర్యప్రకాశ్, టెంపుల్ ఈఈ రాజేశ్ ఉన్నారు.

బస్సుల్లో సీసీ కెమెరాలు

- ప్రయాణంలో పోకిరీలకు చెక్
- ఇప్పటికే 51 బస్సుల్లో బిగింపు
- బడి బస్సుల్లోనూ ఏర్పాటుకు చర్యలు
- రాష్ట్రంలోనే సిరిసిల్లలో తొలిసారి అమలు



సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్



బడిబస్సులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

సిరిసిల్లక్రైం: బస్సు ప్రయాణాల్లో వెకిలి చేష్టలతో ఇబ్బంది పడే మహిళలు, బడి బస్సుల్లో వేధింపులకు గురయ్యే బాలికల రక్షణకు సిరిసిల్ల పోలీసు శాఖ రక్షణ చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఆర్టీసీ, బడి బస్సుల్లో సీసీ కెమెరాలు బిగించాలని సంబంధిత యాజమాన్యాలతో వారం రోజులు అవగాహన సదస్సు నిర్వహించింది. నేర నియంత్రణలో సీసీ కెమెరాల ఉపయోగం గురించి వివరించారు. జిల్లాలోని ఆర్టీసీ, బడి బస్సుల్లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా బిగించాలని ఆదేశించారు. సిరిసిల్ల, వేములవాడ సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని బడిబస్సుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియ ఊపందుకుంది. ఆర్టీసీ బస్సుల్లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసే పని కొనసాగుతోందని పోలీసు అధికారులు తెలిపారు.


51 బస్సుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తి

జిల్లాలోని 112 స్కూల్ బస్సులు, 105 వరకు ఆర్టీసీ బస్సులు ఉన్నట్లు అధికారిక గణాంకాలున్నాయి. వీటికి అదనంగా మరో 200 వరకు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ఉన్నట్లు తెలుస్తోంది. వీటన్నింటిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు ఎస్పీ అఖిల్ మహాజన్ మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. ఈమేరకు జిల్లాలోని ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలతో సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి విడివిడిగా సమావేశాలు నిర్వహించారు. విద్యార్థుల రక్షణకు స్కూల్ బస్సుల్లో సీసీ కెమెరాలు బిగించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లాలోని పాఠశాలల నిర్వాహకులు ముందుకొచ్చారు. ఇప్పటి వరకు సిరిసిల్లలో 10, వేములవాడలో 21 స్కూల్ బస్సుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తయింది. మిగతా వాటిలో దశలవారీగా ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతీ బస్సుకు రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ముందుగా ఆలోచన చేసిన అధికారులు.. బస్సు లోపల ఖచ్చితంగా సీసీ కెమెరాలు ఉండాలని నిర్ణయించారు. బస్సులో ప్రయాణించే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది ఎదురైన వెంటనే చర్యలకు వెళ్లడానికి వీలుంటుందని పోలీసులు తెలిపారు. వెలుపల భాగంలో సీసీ కెమెరాలను అమర్చడంతో ఏదేని ప్రమాదం జరిగితే వెంటనే నిజానిజాలను వెలికితీసే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటి వరకు 20 ఆర్టీసీ సూపర్‌లగ్జరీ బస్సుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ఆన్‌లైన్ అనుసంధానం

బస్సుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీ ప్రస్తుతం ఆయా బస్సు యజమానుల ఫోన్‌లో వీక్షించి, పర్యవేక్షించే విధానం అందుబాటులో ఉంది. రానున్న రోజుల్లో కమాండ్ కంట్రోల్ విధానంలో వీక్షించేందుకు అందుబాటులోకి తెచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

విద్యార్థినులు, మహిళల రక్షణ కోసం



మెస్సేజ్ టు ఎస్పీ నంబర్‌కు వచ్చిన మెస్సేజ్ ఆధారంగా బస్సుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలనే ఆలోచన వచ్చింది. బస్సుల్లో తాగుబోతులు, పోకిరీ చర్యలకు చెక్ పెట్టే అవకాశం ఉంది. సీసీ కెమెరాలోని ఫుటేజీని పరిశీలించి తప్పు ఎవరిదన్నది తెలుసుకోవచ్చు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా సిరిసిల్లలోనే ప్రథమంగా అమలు చేస్తున్నాం.

– అఖిల్ మహాజన్, ఎస్పీ

టెక్స్‌టైల్ పార్క్‌లో సొసైటీ సభ్యులు



టెక్స్‌టైల్ పార్కులో ఐఆర్‌డీఎస్ సభ్యులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని బద్దెనపల్లి–సారంపల్లి టెక్స్‌టైల్ పార్కును బుధవారం ఐడియల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ(ఐఆర్‌డీఎస్) బృందం సభ్యులు సందర్శించారు. నాబార్డ్ ద్వారా గంభీరావుపేట మండలం గజసింగవరం, కొత్తపల్లి గ్రామాల్లో ఫ్యాబ్రిక్ పెయింటింగ్ శిక్షణ పొందిన 40 మంది మహిళలు పరిశీలించారు. తమకు అపెరల్ పార్క్‌లో ఉపాధి కల్పించాలని టెక్స్‌టైల్ పార్కు అధ్యక్షుడు అన్నల్‌దాస్ అనిల్‌కుమార్‌కు విన్నవించారు. స్పందించిన అనిల్‌కుమార్ పది రోజుల ప్రత్యేక శిక్షణ అందించి అపెరల్‌పార్కులో ఉపాధి కల్పించేందుకు కృషిచేస్తానని భరోసానిచ్చారు. టెక్స్‌టైల్ పార్కు రీసోర్స్‌పర్సన్‌లు రమణ, జనార్దన్, ఐఆర్‌డీఎస్ సంస్థ డైరెక్టర్ కొండ్ర రాజలింగం, ఎస్‌హెచ్‌జీ మహిళలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు అప్పగింత



సెల్‌ఫోన్ అందిస్తున్న సీఐ కృష్ణకుమార్

బోయినపల్లి/వేములవాడరూరల్/ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో బుధవారం పలు పోలీస్‌స్టేషన్లలో బాధితులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి ఆయా పోలీస్‌స్టేషన్లలో బాధితులకు పోలీసులు తిరిగి అప్పగించారు. ఈ సందర్భంగా బోయినపల్లి మండలంలోని నర్సింగాపూర్‌కు చెందిన ఉప్పులేటి రాములు యువకుడు ఈనెల 15న విలాసాగర్ నుంచి బోయినపల్లి వెళ్తుండగా సెల్‌ఫోన్ పోయిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. 24 గంటల్లోనే బాధితుడికి ఎస్సై మహేందర్ అప్పగించారు. వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రామానికి చెందిన మహేశ్ యువకుడుసెల్‌ఫోన్ పోగొట్టుకోగా వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్ బాధితుడికి అప్పగించారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్‌కు చెందిన అల్లే బాలయ్య తనసెల్‌ఫోన్ పోగొట్టుకున్నట్లు గతనెల 29న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్‌లో వివరాలు నమోదుచేయగా సెల్‌ఫోన్ దొరికిన వ్యక్తిని గుర్తించి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని బాధితుడికి ఎస్సై రమాకాంత్ అందించారు. ఈ సందర్భంగా బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌ని కలిసిన రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



పుష్పగుచ్ఛం అందిస్తున్న రజక సంఘం నాయకులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఎండీ.ఆయాజ్‌ను రజకసంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు పట్టణ రజక సంఘం అధ్యక్షుడు దండు శ్రీనివాస్, విక్రం, మల్లేశం, తదితరులు ఉన్నారు.

వరుస చోరీలతో వణుకు

- దాడులతో భయపడిపోతున్న జనం
- పోలీసులకు కునుకు లేకుండా చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు
- నాలుగు రోజుల్లో మూడుచోట్ల చోరీలు
- ప్రత్యేక బృందాలతో దొంగల కోసం పోలీసుల అన్వేషణ



చోరీ జరిగిన తీరుపై బంగ్లాపైకి వెళ్లి పరిశీలిస్తున్న డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ కృష్ణకుమార్



రాడ్‌తో దాడిచేస్తున్న గుర్తు తెలియని వ్యక్తి (ఫైల్)

వేములవాడ: వేములవాడలో జరుగుతున్న వరుస చోరీలు జనాలను వణికిస్తున్నాయి. ఈనెల 13న ఓ గుర్తు వ్యక్తి పట్టణంలోని భగవంతరావునగర్‌లోని పిల్లి లత ఇంట్లో చొరబడి ఆమెపై రాడ్‌తో దాడిచేసిన సీసీ కెమెరా దృశ్యాలు వైరల్‌గా మారాయి. దీంతో వేములవాడ ప్రాంతవాసులు భయంతో వణికిపోతున్నారు. ఇళ్లు వదిలి వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. మహిళపై దాడిచేసిన దృశ్యాలను చూసిన మహిళలు రాత్రివేళలో ఒంటరిగా బయటికి వెళ్లాలంటేనే జంకుతున్నట్లు చెబుతున్నారు. నాలుగు రోజులు వ్యవధిలో మూడుచోట్ల చోరీలు జరగ్గా పోలీసులకు కంటిమీద కునుకులేకుండా పోయింది. దీంతో ప్రత్యేక బృందాలతో గస్తీ పెంచారు. దొంగలను పట్టుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇప్పటికే ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి చేరుకున్న వారి వివరాలు సేకరిస్తున్నారు. అనుమానితులపై నిఘా పెంచారు.

నాలుగు రోజుల్లో మూడు చోరీలు...

వేములవాడ సబ్ డివిజన్‌లో నాలుగు రోజుల వ్యవధిలోనే మూడుచోట్ల దొంగలుపడ్డారు. వేములవాడ పట్టణంలోని భగవంతరావునగర్‌లోని పిల్లి లత ఇంటిలో ఆమెపై దాడిచేసి 7గ్రాముల బంగారు చైన్ లాక్కెళ్లాడు. పట్టణంలోని చాణక్య నర్సింగ్‌హోమ్ ముందున్న ఏ టూ జెడ్ షాపులో జాలీలను కత్తిరించి కౌంటర్‌లోని రూ.50వేల నగదు దోచుకెళ్లాడు. చందుర్తి మండలకేంద్రంలో జలేందర్‌కు చెందిన కారును ఈనెల 14న దొంగిలించారు. అలాగే నిత్యం వేములవాడ పట్టణంలో బైక్‌లు చోరీకి గురవుతునే

ప్రజలు భయపడొద్దు...



చోరీలకు పాల్పడుతున్న వారిని గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి గాలింపు చర్యలు చేపడతున్నాం. ప్రజలు భయపడొద్దు. ఎవరైనా అపరిచితులు, అనుమానితులు కనిపిస్తే 100కు డయల్ చేయండి. పోలీసులు తప్పకుండా రక్షణ కల్పిస్తారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటాం. ఇంటి యజమానులు ఇళ్లకు తాళాలు వేసి ఎక్కడికి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలి, ఎవరైనా వెళితే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. గుర్తుతెలియని వ్యక్తులను ఇంటిలోకి అనుమతించొద్దు.

– నాగేంద్రచారి, డీఎస్పీ, వేములవాడ

భూమి తమదేనంటూ బెదిరింపులు

- ప్రహరీ నిర్మాణం అడ్డగింత.. యజమానిపై దాడి
- అడ్డుకున్న స్థానికులు.. చెట్టుకు కట్టేసి పోలీసులకు అప్పగింత
- కరీంనగర్ జిల్లా చెంజర్ల గ్రామంలో ఘటన

మానకొండూర్: తమకు సంబంధం లేని భూమిలోకి చొరబడి సదరు భూమి తమదేనంటూ ముగ్గురు వ్యక్తులు సీడ్ ప్లాంటు యజమానిని బెదిరించారు. అతడిపై దాడికి దిగారు. స్థానికులు అడ్డుకుని ఆ ముగ్గురిని చెట్టుకు కట్టేశారు. అనంతరం పోలీసులకు అప్పగించగా కేసు నమోదైన ఘటన కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం చెంజర్లలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. కరీంనగర్‌కు చెందిన గురిజాల జయరామయ్య మూడేళ్లక్రితం మానకొండూర్ మండలం చెంజర్ల శివారులో సర్వే నంబర్ 156లో 1.08 ఎకరాల భూమిని కరీంనగర్‌కు చెందిన బొమ్మవరం కిషన్‌రావు వద్ద కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఆ భూమిలో సంఘమిత్ర సీడ్స్, కార్పొరేషన్ పేరిట గోదాం నిర్మించాడు. బుధవారం సీడ్ కంపెనీ చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపడుతుండగా తిమ్మాపూర్ మండలం రేణికుంటకు చెందిన రాజు గౌడ్, కరుణాకర్, దివాకర్ అక్కడికి చేరుకున్నారు. ఆ భూమి తమదేనంటూ గోడ కట్టకుండా అడ్డుకున్నారు. చంపుతామని యజమానిపై దాడిచేశారు. చొక్కా చింపేసి, చంపుతామని బెదిరించారు. అక్కడే ఉన్న కొందరు స్థానికులు ఆ ముగ్గురిని చెట్టుకు బంధించారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. సీడ్ ప్లాంటు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.



ముగ్గురిని తాడుతో చెట్టుకు బంధించిన స్థానికులు

అధికారుల విచారణ



విచారిస్తున్న ఎఫ్ఎస్ఓ అఫ్జల్ హుస్సేన్, ఎఫ్‌బీఓ అనిత

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని మర్లపేట గ్రామం బీటీ రోడ్డు శివారులో హరితహారం చెట్ల నరికివేతపై బుధవారం ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డి, వేములవాడ ఫారెస్ట్ ఎఫ్ఎస్‌వో అఫ్జల్ హుస్సేన్, ఈజీఎస్ ఏపీవో సబిత, ఫారెస్ట్ ఎఫ్‌బీవో అనిత క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. బీటీ రోడ్డు పరిసరాల్లో హరితహారం చెట్లను తొలగించిన స్థలాన్ని మంగళవారం ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి పరిశీలించారు. ఈక్రమంలో అటవీశాఖ, ఈజీఎస్ శాఖల అధికారులు ఫీల్డ్ విజిట్ చేసి వివరాలు నమోదు చేసుకున్నారు. హరితహారం చెట్లు నరికివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీరివెంట పంచాయతీ కార్యదర్శి, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

బ్లేడ్ ట్రాక్టర్ పట్టివేత




అటవీ శాఖ అధికారులు పట్టుకున్న రెండు బ్లేడ్ ట్రాక్టర్

చందుర్తి(వేములవాడ): అటవీ భూమిని రెండు బ్లేడు ట్రాక్టర్ల సహాయంతో అక్రమంగా సాగుచేస్తుండగా బుధవారం అటవీశాఖ అధికారులు పట్టుకుని చందుర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాలు. చందుర్తి మండలం దేవునితండా శివారులోని అటవీ ప్రాంతాన్ని సాగుచేస్తున్నారన్న సమాచారంతో బ్లేడ్ ట్రాక్టర్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించగా, తప్పించుకునేందుకు ప్రయత్నం చేశారు. అడ్డుకోబోయిన అటవీశాఖ అధికారులు, సిబ్బందిపై గిరిజనులు తిరగబడేందుకు ప్రయత్నించగా చందుర్తి పోలీస్ స్టేషన్‌కు సమాచారాన్ని అందించారు. స్థానిక ఎస్సై అశోక్ ఇద్దరు కానిస్టేబుళ్లను పంపించారు. పోలీసుల సహకారంతో రెండు బ్లేడ్ ట్రాక్టర్లను ఠాణాకు తరలించారు. అక్రమంగా సాగుకు పాల్పడిన వ్యక్తులతో పాటు విధులను ఆటంకం ఏర్పర్చిన వారిపై ఫిర్యాదు చేయనున్నట్లు సెక్షన్ అధికారి అన్వర్ తెలిపారు.

మహాధర్నా విజయవంతం చేయాలి

- ఈనెల 19న హైదరాబాద్‌లో మహాధర్నా
- టీయూపీఎస్ జిల్లా అధ్యక్షుడు గసికంటి శ్రీనివాస్



టీపీయూఎస్ పోస్టర్ ఆవిష్కరణ

బోయినపల్లి(చొప్పదండి): విద్యారంగ, ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని ఈనెల 19న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద చేపట్టే మహాధర్నా విజయవంతం చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) జిల్లా అధ్యక్షుడు గసికంటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం బోయినపల్లి హైస్కూల్‌లో మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. పీఈటీల ఉన్నతీకరణ, ఐఆర్ వెంటనే ప్రకటించాలని, పీఆర్సీ కమిటీ వేసి, 317 జీవోతో స్థానికత కోల్పోయిన వారికి సొంత జిల్లాల్లో అవకాశం కల్పించాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దుచేసి, పాత పెన్షన్ విధానం అమలుచేయాలని కోరారు. మోడల్ స్కూల్, గిరిజన, కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. సమస్యల సాధనకు రాష్ట్రంలో ఈనెల 19న చేపట్టే మహాధర్నా విజయవంతానికి ఉపాధ్యాయులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకట్రావు, మండల అధ్యక్షుడు తిరుపతి, పవన్, సంపత్‌రావు, ఆశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ శశిధర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ శశిధర్‌రెడ్డి కోరారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో బుధవారం రాత్రి పోలీస్ కమ్యూనిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో ప్రజలు, పోలీసులకు సహకరిస్తూ నేరాల నియంత్రణలో భాగస్వాములు కావాలని కోరారు. యువత గంజాయి, గుడుంబా వంటి మత్తు పదార్థాల వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి వ్యక్తి సమాజాభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు. ఎస్సై రమాకాంత్, సర్పంచ్ కదిరె రజిత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్



జీపుజాతలో మాట్లాడుతున్న ప్రశాంత్

ముస్తాబాద్/ఇల్లంతకుంట: విద్యారంగ సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, జిల్లా అధ్యక్షుడు మంద అనిల్ ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ సమరభేరి జీపు జాత నిర్వహిస్తోందని ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ సమరభేరి జీపుజాత ముస్తాబాద్‌కుచేరడంతో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేశ్ స్వాగతం పలికారు. పూలే, చాకలి ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఇల్లంతకుంటలో అంబేడ్కర్ విగ్రహానికి అనిల్ పూలమాల వేసి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద జీపు జాతా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కేజీ టూ పీజీ ఉచిత విద్య మరిచిందన్నారు. విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని, అందుకే గురుకులాలు, కేజీబీవీలు, ప్రభుత్వ పాఠశాలలు సమస్యలకు నిలయాలుగా మారాయన్నారు. గురుకులాలు, వసతి గృహాల్లో మెస్ చార్జీలు పెంచకపోవడంతో విద్యార్థులకు సరైన ఆహారం, కాస్మోటిక్స్ అందడం లేదన్నారు. ఖాళీగా వున్న ఉపాధ్యాయ, వార్డెన్ పోస్టులను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. జీపు జాతా కార్యక్రమం ద్వారా తమ దృష్టికి వచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు మల్లారం ప్రశాంత్, రాకేశ్, మనోజ్‌కుమార్, ఆదిత్య రామ్‌చరణ్, అభిషేక్, సంతోష్, నాగరాజు, అనీల్, సాయిచరణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో నడిపిండు..
రైతును బలితీసుకుండు

- ట్రాక్టర్ కిందపడి అంబారిపేటవాసి దుర్మరణం
- పలుమార్లు పైనుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జయిన మృతదేహం



పోచయ్య (ఫైల్)

వెల్గటూర్(ధర్మపురి): మద్యం తాగి వాహనాలు నడపరాదని పోలీసులు ఎంత అవగాహన కల్పించినా కొందరు వినడం లేదు. మద్యం మత్తులో ట్రాక్టర్ నడిపిన వ్యక్తి ఓ రైతును బలితీసుకున్నాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని అంబారిపేట గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. అంబారిపేటకు చెందిన ముడిమడుగుల పోచయ్య(50) తన వ్యవసాయ పొలం దున్నడానికి మంగళవారం అదే గ్రామానికి చెందిన జాడి బానయ్యను పిలిచాడు. అతను అతిగా మద్యం తాగి, ఆ మత్తులో ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్నాడు. వెనక ఉన్న పోచయ్యను గమనించకుండా వేగంగా నడపడంతో ట్రాక్టర్ అతన్ని తొక్కుకుంటూ వెళ్లింది. ఈ సంఘటనలో పోచయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయాన్ని కూడా తెలుసుకోలేని స్థితిలో ఉన్న బానయ్య పలుమార్లు ట్రాక్టర్‌ను మృతదేహం పైనుంచి తిప్పడంతో నుజ్జునుజ్జయి, తల, మొండెం, కాళ్లు, చేతులు వేటికవే పూర్తిగా తెగిపోయాయి. పొలం దున్నడం పూర్తయిన తర్వాత పోచయ్య కనిపించడం లేదని అతని కుమారుడు సతీశ్‌కు చెప్పాడు. దీంతో కుటుంబసభ్యులు గ్రామంలో వెతకగా ఆచూకీ లభించలేదు. రాత్రి సమయంలో పొలంలో వెతకగా రక్తం, పోచయ్య శరీర భాగాలు కొద్దిగా కనిపించాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు బుధవారం పొలంలో పూర్తిగా తెగిపడిన మృతుడి శరీర భాగాలను బయటకు తీయించి, పోస్టుమార్టం చేయించారు. పోచయ్య కుమారుడి ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మద్యం తాగి, ట్రాక్టర్ నడిపి, పోచయ్య మృతికి కారణమైన బానయ్యపై కఠినచర్యలు తీసుకోవాలని మృతుడి కుటుంబసభ్యులు కోరుతున్నారు.

రాష్ట్రాభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లఅర్బన్: తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. సిరిసిల్లలోని 16, 19వ వార్డులలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జిందం చక్రపాణి అధ్యక్షతన బీఆర్ఎస్ బూత్ కమిటీ నియామక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిందం కళ మాట్లాడుతూ రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలన్నారు. టెక్స్‌టైల్ పవర్‌లూమ్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ గడ్డం నర్సయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెగా టెక్స్‌టైల్ పార్కును సిరిసిల్లలో నెలకొల్పాలి

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి



మాట్లాడుతున్న రెడ్డబోయిన గోపి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ప్రకటించిన మెగా టెక్స్‌టైల్ పార్కును సిరిసిల్లలో నెలకొల్పి ఈ ప్రాంతంపై ఉన్న ప్రేమను మంత్రి కేటీఆర్ నిరూపించుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి సవాల్ విసిరారు. తంగళ్లపల్లిలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మాట్లాడారు. బీసీబంధు ఎంపీటీసీలు వారి అనుచరులకు ఇస్తున్నారని ఆరోపించారు. మంత్రి కేటీఆర్ సిరిసిల్లలో తన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు పెద్ద కాంట్రాక్టులు ఇస్తూ చిన్న కాంట్రాక్టర్లను ఎదగనీయడం లేదని మండిపడ్డారు. సారంపల్లి నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించిన కేటీఆర్ ఆ గ్రామంలో ఎంత మందికి బీసీబంధు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు సురువు వెంకట్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బూర విష్ణువర్ధన్, మండల ప్రధాన కార్యదర్శి సందవేణి రాజుయాదవ్, ఎస్సీ మోర్చా మండలాధ్యక్షుడు సిరిసిల్ల వంశీ, మైనార్టీ మోర్చా జిల్లా నాయకుడు సాబీర్, సీనియర్ నాయకులు గజభీంకార్ సంతోష్, మంచికట్ల ప్రసాద్ పాల్గొన్నారు.

పెద్దబడిలో మురుగునీటి నిల్వలు

- ఇబ్బందుల్లో విద్యార్థులు



పాఠశాలలో నిలిచిన మురుగునీరు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో మురుగు నీటినిల్వతో దుర్గంధం వెదజల్లుతోందని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తమ పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారని తల్లితండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే.. జెడ్పీ పాఠశాలలో 350 మంది విద్యార్థులు చదువుతుండగా ప్రతీరోజు మధ్యాహ్నం భోజనం చేసేక్రమంలో భోజనానికి ముందు భోజనం తర్వాత ఇటు పెద్దబడి, అటు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునే క్రమంలో ఎక్కడి నీరు అక్కడే నిలుస్తుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంటగదికి, మూత్రశాలలకు మధ్య కట్టిన మురుగునీటి కాలువ సరైనక్రమంలో లేక సమస్య ఉత్పన్నమైందని వార్డుసభ్యుడు పందిర్ల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్ తెలిపారు. వెంటనే మురుగు కాలువ నిర్మాణం చేపట్టి విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

అధికార పార్టీ నేతలకే బీసీ, దళితబంధు పథకాలు

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు చక్రధర్‌రెడ్డి



మాట్లాడుతున్న చక్రధర్‌రెడ్డి

గంభీరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం బీసీ, దళితబంధు పథకాలు అధికార పార్టీ నేతలకే అందిస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు చక్రధర్‌రెడ్డి విమర్శించారు. మండలకేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నామమాత్రంగా బీసీబంధు అమలుచేస్తూ బీఆర్ఎస్ ప్రజలను మోసం చేస్తోందన్నారు. రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న పనుల్లో నాణ్యత లోపించిందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ నేతలు తప్ప ఎవరు సంతోషంగా లేరన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. మండలకేంద్రంలో రోడ్లవిస్తరణ చేపట్టకపోవడంతో అధ్వానంగా మారాయన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్, జిల్లా నాయకులు మేకార్తి శ్రీనివాస్, పెద్దూరి పర్శాగౌడ్, శ్రీనివాస్‌రావు, మల్లారెడ్డి, పత్తి స్వామిరాజ్, రమేశ్, నరేశ్ పాల్గొన్నారు.

ఎగువమానేరును పట్టించుకోరా?



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు ఉమేశ్‌రావు

- రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు ఉమేశ్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టుపై మంత్రి కేటీఆర్‌కు చిత్తశుద్ధి లేదని, ఏళ్లు గడిచినా ప్రాజెక్టును పర్యాటకంగా ఎందుకు మార్చడం లేదని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు చీటి ఉమేశ్‌రావు ప్రశ్నించారు. గంభీరావుపేటలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టులో కనీసం తట్టెడు పూడిక కూడా తీయలేదని, అతిథి గృహానికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయలేదని, పడవలు తెచ్చి తుప్పు పట్టిపోతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐటీ శాఖ మంత్రిగా పొరుగు జిల్లాలో ఐటీహబ్‌లను ప్రారంభిస్తున్న కేటీఆర్ సిరిసిల్లలో ఎందుకు ఐటీ హబ్‌ను ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. గంభీరావుపేట మండలంలో నిర్మించిన 339 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు ఎందుకు అప్పగించడం లేదని అడిగారు. గంభీరావుపేట, లింగన్నపేట గ్రామాల మధ్య లోలెవల్ వంతెన స్థానంలో బ్రిడ్జి ఎందుకు నిర్మించడం లేదని ప్రశ్నించారు. ఓరుగంటి తిరుపతి, దమ్మ శ్రీనివాస్‌రెడ్డి, తాజొద్దీన్, సురేష్, నుస్రత్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.